సాక్షి రంగారెడ్డి
శుక్రవారం । 20 । జనవరి । 2023



సభకు రూ.300కోట్లు ఖర్చా?

ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభకు రూ.300 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. 8లో▸

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మూడు రోజులుగా ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్వకుర్తి తాలుకాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ముగిసాయి. విజేతలకు సీఐ ఉపేందర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుందరయ్య, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఏబీవీ అధ్యక్షుడు ప్రసాద్, ఏబీసీ కోశాధికారి కొత్త మల్లేశ్ పాల్గొన్నారు.

28న మహాలక్ష్మీ సుదర్శన యాగం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లోని రంగనాయకి సమేత శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 28న రథసప్తమిని పురస్కరించుకుని మహాలక్ష్మీ సుదర్శన యాగం నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు యాగం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 98480 62747 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆలయ నిర్వాహకులు సూచించారు.

న్యూస్‌రీల్

విదూషణ్ పురస్కారం ప్రదానం



రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

షాద్‌నగర్: విద్యారంగంలో ఎనలేని కృషి చేస్తూ, పేద విద్యార్థుల సంక్షేమానికి పాటు పడుతున్న షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ విదూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ ఎంటర్‌ప్రెనరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ఎనలేని కృషి చేస్తున్న వారికి ఉత్తమ పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో గురువారం పురస్కారాల ప్రదానం చేశారు. ఈ మేరకు రాజేంద్రప్రసాద్ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, జ్ఞాపిక, పురస్కారంతో అభినందించారు.

మణికొండలో కోహ్లి సందడి



మణికొండ: భారత క్రికెటర్ విరాట్ కోహ్లి గురువారం మణికొండలో సందడి చేశారు. షేక్‌పేట నుంచి మణికొండకు వచ్చే పైప్‌లైన్ రోడ్డులో హాల్‌మార్క్ గ్రీన్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ప్రైవేటు జిమ్‌లో ఓ యాడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. రాయదుర్గం పోలీసులు పెద్ద ఎత్తున భద్రత ఏర్పాటు చేశారు. ఓ కారులో సాదాసీదాగా వచ్చిన ఆయన జిమ్‌లోకి వెళ్లి షూటింగ్‌లో పాల్గొని రెండు గంటల్లో తిరిగి వెళ్లిపోయారు. కోహ్లిని చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు గుమిగూడారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి సీఈఓగా ఖాజా మొయినుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఎస్.ఖాజా మొయినుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ గురువారం ఉత్తర్వు జారీ చేశారు. ప్రస్తుతం మొయినుద్దీన్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా పని చేస్తున్నారు.

రేషన్ షాపుల ద్వారా బ్యాంకింగ్ సేవలు

సాక్షి, సిటీ బ్యూరో: ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా ఇక బ్యాంకింగ్ సేవలు అందనున్నాయి. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) రేషన్ దుకాణాల ద్వారా బేసిక్ సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటికే పౌరసరఫరాల శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. రేషన్ డీలర్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు సులభమైన, సురక్షితమైన పద్ధతిలో డిజిటల్ లావాదేవీలకు పౌరసరఫరా శాఖ పచ్చజెండా ఊపినట్లయ్యింది.

బిజినెస్ కరస్పాండెంట్లుగా డీలర్లు

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెట్లుగా రేషన్ డీలర్లకు లైసెన్స్‌లు జారీ చేయనుంది. ప్రతి బ్యాంకింగ్ సేవలపై కమీషన్లు అందించనుంది. ఇప్పటికే బిజినెస్ కరస్పాండెట్లుగా పనిచేసేందుకు ఆసక్తి కనబర్చే డీలర్ల వివరాలను బ్యాంక్ అధికారులు సేకరిస్తున్నారు. త్వరలో బ్యాంకింగ్ సేవలపై రేషన్ డీలర్లకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

ఆధార్-ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం

రేషన్ దుకాణాల వద్దకు అధిక సంఖ్యలో జనం వచ్చే అవకాశాలున్నందున బ్యాంకింగ్ లావాదేవీలకు కేంద్ర బిందువులుగా మారే అవకాశం ఉందని ఐపీపీబీ భావిస్తోంది. ఏదైనా బ్యాంకు ఖాతాదారులు రేషన్ దుకాణానికి వస్తే డబ్బు జమ, విత్ డ్రా సేవలు అందించేలా చర్యలు చేపడుతోంది. ఆధార్-ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీ ఎస్) లావాదేవీలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను రేషన్ దుకాణాల్లోని ఆధునిక ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పాస్) పరికరాల్లోనే ఐపీపీబీ సేవల సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఆర్థిక సేవలతో పాటు బీమా ఇతర సేవలు అందించే వెసులుబాటు కల్పిస్తున్నారు.

గ్రేటర్‌లో 2,301 దుకాణాలు

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్‌లో 690, మేడ్చల్‌లో 636, రంగారెడ్డిలో 975 రేషన్ షాపులు ఉన్నాయి. ఆహార భద్రత కార్డులు కలిగిన స్థానిక, స్థానికేతర 20 లక్షల కుటుంబాలు ప్రభుత్వ చౌకధరల దుకాణాల నుంచి సరుకులు డ్రా చేస్తుంటారు.

పేదల జీవితాల్లో వెలుగులు

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

- కంటి వెలుగు ప్రారంభోత్సవంలో మంత్రి సబితారెడ్డి



మీర్‌పేట: పరీక్షల అనంతరం వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

మీర్‌పేట: కంటి వెలుగుతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో మంది పేద ప్రజలకు వెలుగును ప్రసాదించారని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంధత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. వంద రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని, వారంలో ఐదు రోజులు శిబిరాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలో 80 వైద్య బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే లక్ష కళ్లద్దాలు చేరుకున్నాయని వెల్లడించారు. కంప్యూటరైజ్డ్ పరీక్షలు నిర్వహించి వెంటనే కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు తేదీలను కేటాయిస్తామన్నారు. దీంతో పాటు 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఐ స్క్రీనింగ్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అమయ్‌కుమార్ సూచించారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి సైతం 15 నుంచి 20 రోజుల్లో ఇళ్లకు వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఉప వైద్యాధికారి గీత, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొంద్ర గౌరీశంకర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగుతో అందమైన జీవితం

బడంగ్‌పేట్: మసకబారిన కళ్లకు వెలుగులు నింపి అందమైన జీవితం ప్రసాదించే భాగ్యాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారని మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి 1వ డివిజన్‌లోని నవయుగ కాలనీ, అల్మాస్‌గూడ 2వ డివిజన్‌లోని ప్రైమరీ స్కూల్‌లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

7,894 మందికి పరీక్షలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో 7,894 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 3,471 మహిళలు ఉండగా, 4,423 మంది పురుషులు ఉన్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 4,614 మంది దృష్టిలోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరిలో 1,390 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశారు. 40 ఏళ్ల లోపు వారు 102 మంది ఉండగా, ఆపై వయసు వారు 1,288 మంది ఉన్నారు. మరో 1,890 మందికి ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాలు సూచించారు.

శిబిరాల పరిశీలన



ఎన్‌రోల్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇబ్రహీంపట్నం రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దండుమైలారం, తులేకలాన్ గ్రామాల్లో గురువారం ప్రారంభమైన కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిజిస్టర్లలో లబ్ధిదారుల పేర్లు నమోదు చేయాలని, పరీక్షలు చేయగానే ఎప్పటికప్పుడు అద్దాలు అందజేయాలని సూచించారు. ఎక్కడ ఇబ్బందులున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ జయరాం విజయ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా గంధోత్సవం

భక్తిశ్రద్ధలతో జేపీదర్గా గంధోత్సవం

కొత్తూరు: జేపీదర్గా ఉర్సులో భాగంగా గురువారం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి బాబాకు గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధిలో భాగంగా రూపొందిస్తున్న మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో పూర్తిచేసి, సీఎం కేసీఆర్ సూచనలతో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న వ్యాపారులతో కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని శాంతియుతంగా పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. దర్గా అభివృద్ధిలో భాగంగా ఎవరికీ నష్టం వాటిల్లకుండా ప్లాన్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక మైనార్టీ నాయకులు ఇన్ముల్‌నర్వలో ఉర్దూ మీడియం పాఠశాలను తిరిగి ప్రారంభించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, రషీద్, దేవేందర్‌యాదవ్, యాదగిరి, కోస్గి శ్రీనివాస్, డోలీ రవీందర్, గోపాల్‌నాయక్, శ్రీరాములు, సిరాజ్, ఖాజా, మైనార్టీ నాయకులు, వక్ఫ్‌బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కందవాడలో భూ న్యాయ శిబిరం

చేవెళ్ల: ధరణి పోర్టల్, ఇతర భూ సమస్యలున్న రైతుల కోసం మండలంలోని కందవాడలో లిప్స్, గ్రామీణ న్యాయ పీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 21న (శనివారం) భూ న్యాయ శిబిరం నిర్వహిస్తున్నట్లు సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి పోర్టల్‌తో రైతులకు అనేక భూ సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. వీటిని సరిచేయాలని రెవెన్యూ కార్యాలయల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో, ఎవరిని కలవాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి సరైన పరిష్కారం చూపించేందుకే ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ నిపుణులు, న్యాయవాదులు పాల్గొని సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పచ్చని తోటలపై పిచ్చి విషం!

- విచ్చలవిడిగా రసాయనాల పిచికారీ
- పండ్లు, కాయగూరల పంటలపై స్ప్రే
- తెగుళ్ల నివారణ, తాజాదనం కోసం..
- ప్రమాదకర మందుల వినియోగం
- దెబ్బతింటున్న ప్రజారోగ్యం
- పట్టించుకోని అధికారగణం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పండ్లు, కాయగూరల తోటలపై శాస్త్రీయ పర్యవేక్షణ కరువైంది. తెగుళ్లు, చీడపీడల బారి నుంచి పంటలను కాపాడుకోవాలనే తపన, కోసిన తర్వాత మార్కెట్లో మంచి ధర రావాలనే ఆశతో రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగుపై దిశానిర్దేశం చేయాల్సిన ఉద్యాన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఈ కాయగూరలు, పండ్లు తిన్న వారు కేన్సర్, శ్వాస సంబంధ సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పించే వారేరి?

గతంలో కరివేపాకు, కొత్తిమీర, పుదీన పూర్తిస్థాయి పంటలుగా సాగు చేసేవారు కాదు. ప్రస్తుతం మార్కెట్లో వీటికున్న డిమాండ్‌తో ఏడాదంతా సాగు చేస్తున్నారు. కరివేపాకుకు ఏ తెగులు వస్తే ఏ మందు వేయాలో ఇప్పటికీ స్పష్టమైన ప్రమాణాలు లేవు. వ్యాపారులు ఇచ్చే విషపూరిత రసాయనాలనే చల్లుతున్నారు. పండ్లు, కాయగూరలు సాగు చేసే మెజార్టీ రైతులకు ఏ తెగులుకు ఏ మందు వాడాలో తెలియదు. తెగులు కనిపిస్తే చాలు నేరుగా ఎరువుల దుకాణానికి వెళ్లి, వారిచ్చే రెండు మూడు రకాల మందులు తెచ్చి మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆశించిన స్థాయిలో ఉద్యాన అధికారులు లేరు. జిల్లాలో 38 పోస్టులకుగాను తొమ్మిది మందే ఉన్నారు. ఐదారు మండలాలకు ఒకరు పని చేస్తున్నారు. ఒక ఊరికి ఒకసారి వెళ్తే.. మళ్లీ ఆ ఊరికి వెళ్లేందుకు మూడు నెలలు దాటుతోంది.

ఎడాపెడా పిచికారీ

గ్రేటర్ పరిధిలో 1.20 కోట్ల జనాభా ఉన్నట్లు అంచనా. వీరికి రోజుకు సగటున 1,978 మెట్రిక్ టన్నుల కాయగూరలు అవసరం. వీటిలో సగటున 791 మెట్రిక్ టన్నులు జిల్లా నుంచే సరఫరా అవుతున్నాయి. మరో 1,187 మెట్రిక్ టన్నులు ఇతర జిల్లాల నుంచి వస్తున్నాయి. 12,453 ఎకరాల్లో టమాటా సాగు చేస్తుండగా, 3,032 ఎకరాల్లో క్యారెట్, 1,540 ఎకరాల్లో పచ్చిమిర్చి, 1,524 ఎకరాల్లో బీట్‌రూట్, 1,432 ఎకరాల్లో బెండ, 1,321 ఎకరాల్లో వంకాయ తోటలు సాగవుతున్నాయి. మరో 3,598 ఎకరాల్లో పాలకూర, మెంతి, పుదీన ఇతర ఆకుకూరలు సాగవుతున్నట్లు అంచనా. సుమారు 30 వేల ఎకరాల్లో జామ, బొప్పాయి, మామిడి, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, ఇతర పండ్ల తోటలు సాగవుతున్నాయి. చీడపీడల నివారణ కోసం రైతులు తరచూ వీటిపై పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

2021-22లో పండ్ల తోటల సాగు (మెట్రిక్ టన్నుల్లో)

పంట పేరు	సాగు విస్తీర్ణం	ఉత్పత్తి
పండ్లు	29,385	1,62,166
కూరగాయలు	33,363	3,08,460
పువ్వులు	6,285	42,035
సుగంధద్రవ్యాలు	1,475	4,280
ఔషధ/సుగంధ మొక్కలు	203	1,600
ఆగ్రో ఫారెస్ట్రీ	1,715	-
పట్టు పరిశ్రమ	140	-

ఏదిపడితే అది వినియోగం

ప్రమాదకరమైన 'మోనోక్రోటోఫాస్' మందులను పండ్లు, కాయగూరల పంటలపై పిచికారీ చేస్తున్నారు. 'ఆసిఫెట్-75' మందును పత్తి, వరి, కుసుమ పంటలకే వాడాల్సి ఉంది. ఇది చల్లిన 15 రోజుల తర్వాత పంటను కోయాల్సి ఉన్నా.. బెండ, వంగ, చిక్కుడు పంటలపై పిచికారీ చేసిన రెండో రోజే కోస్తున్నారు. 'ఆల్ఫాసైపర్ మైత్రిన్ 40'ని పత్తిలో పచ్చపురుగు నివారణ కోసమే వాడాల్సి ఉండగా కాయగూరలపై కూడా చల్లుతున్నారు. చీడపీడల బెడద ఎక్కువగా ఉండే ఆకుకూరలు, బెండ, టమాటా, వంకాయ, చిక్కుడు, కాకర, మిర్చి వంటి పంటలపై రోజువిడిచి రోజు చల్లుతున్నారు. రసాయన అవశేషాలు పూర్తిగా మాయం కాకుండానే కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. తాజాగా నిగనిగలాడే ఈ పండ్లు, కాయగూరలను చాలామంది కనీసం శుభ్రం చేయకుండానే తినేస్తున్నారు. తయారీ కంపెనీలు వ్యాపారులకు అధిక కమీషన్ ఆశ చూపిస్తున్నాయి. వీటికి కక్కుర్తి పడుతున్న వ్యాపారులు తేలికపాటి తెగుళ్ల నివారణకు కూడా విషపూరిత రసాయనాలు అంటగడుతున్నారు. పురుగుల మందుల చట్టం 1968 ప్రకారం ఇలాంటి వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఆరోగ్య సమస్యలు



రసాయన అవశేషాలు ఉన్న పండ్లు, కూరగాయలను తినడం ద్వారా నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. కేన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బులు వెలుగు చూస్తాయి. కడుపులో పుండ్లు ఏర్పడి కేన్సర్‌కు దారి తీస్తాయి. గుండె ఇతర శరీర భాగాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది.

– డాక్టర్ మధుసూదన్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ఉస్మానియా ఆస్పత్రి

ఉప్పు నీటిలో కడగడం మేలు

వాస్తవానికి మందులు పిచికారీ చేసిన వారం తర్వాతే ఆయా పంటలను కోయాల్సి ఉంది. కానీ ఆకులు, కాయలు ముదిరిపోతాయనే ఆలోచనతో రైతులు రసాయనాలు పిచికారీ చేసిన మరుసటి రోజే పంటను కోసి మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆయా ఆకుకూరలు, కూరగాయలను వంట చేసే ముందు పావుగంట సేపు ఉప్పు నీటిలో నానబెట్టాలి. ఆ తర్వాత వాటిని శుభ్రంగా కడిగి వంట చేయాలి.

– శశిభూషణ్, శాస్త్రవేత్త, ఏజీ వర్సిటీ

అవగాహన కల్పిస్తున్నాం



ఏ తెగులుకు ఏ మందు పిచికారీ చేయాలనే అంశంపై ఇప్పటికీ చాలామంది రైతులకు అవగాహన లేదు. క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులు రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి.. ఏ పంటకు ఏ సమయంలో.. ఎలాంటి మందులు వాడాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

అన్నీ ఒకే గొడుగు కిందికి తేవాలి

- ఎస్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు

యాచారం: వివిధ పేర్లతో పిలిచే పాఠశాలలను ఒకే గొడుగు కిందకు తెచ్చి.. అభివృద్ధి చేసి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని గునుగల్ ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. తనకే ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు ఎన్నో పేర్లతో ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని అన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయుల పదోన్నతుల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజమణి, ప్రధాన కార్యదర్శి పుట్టపాక ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు సత్తు పాండురంగారెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సాల్మాన్‌రాజ్, బాలకృష్ణ, శ్రీను, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి



ఉపాధ్యాయులతో టీయూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యల సాధనే లక్ష్యంగా కృషి చేస్తానని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని చనువెళ్లి, ఖానాపూర్, ఆలూరు, అంతారం, కౌకుంట్ల, తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీయూటీఎఫ్ స్థాపించి స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సాధనకోసం ఎన్నో ఉద్యమాలు, సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలను ఉద్యమం వైపు మళ్లించినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌కు శాశ్వత పరిష్కారం, సీపీఎస్ రద్దు, ఒత్తిడి లేని విద్య, పదోన్నతులు, బదిలీలు తదితర అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం దిశగా ముందుకు

- మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయండి: మంత్రి సబితారెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అట్టహాసంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం మార్కెట్ యార్డులో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై నూతన చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. కరువు కాటకాల నుంచి రైతులకు విముక్తి లభించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం పండగైపోయిందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేసి రైతులకు అండగా నిలిచారన్నారు. రైతుబంధు, రైతు బీమా అన్నదాతలకు ధీమా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. భారత దేశానికి కేసీఆర్ అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ నుంచి ప్రజలు గ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. ఒక్క ఇబ్రహీంపట్నంలోనే రూ. 513 కోట్లు రైతు బీమా, రైతుబంధు కోసం వెచ్చించారంటే ఇంతకంటే గొప్పేం కావాలని అన్నారు. ఈ నియోజకవర్గానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఫార్మాసిటీతో పాటు మరో మెడికల్ కాలేజీ వస్తుందన్నారు. మరో యూనివర్సిటీ కూడా రాబోతుందన్నారు. ఇబ్రహీంపట్నం అభివృద్ధి కేసీఆర్ పుణ్యమేనని తెలిపారు. ఒకే ఒక్క చెరువుకు రూ. 12 కోట్లు కేటాయించి అభివృద్ధికి పట్టం కట్టారని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రజలంతా రుణపడి ఉండాలన్నారు.

అంకితభావంతో పని చేయాలి: ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు. రూ. 2.87 కోట్లతో మార్కెట్‌ను అభివృద్ధి చేశామన్నారు. గిడ్డంగులు, షాపింగ్ కాంప్లెక్సులు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఏడు సంవత్సరాల్లో రైతుల కోసం రూ. 513 కోట్లు కేటాయించామన్నారు. రైతు బీమాకు రూ. 33కోట్లు వచ్చిందన్నారు. మంగళ్‌పల్లిలో ఎకరన్నర స్థలం కేటాయించి మార్కెట్ ఏర్పాటు చేస్తామని, రైతులు నేరుగా వచ్చి ఇక్కడే విక్రయించడానికి వీలుంటుందన్నారు. మార్కెట్ స్థలం కోసం 10–15 ఎకరాల స్థలం కేటాయిస్తామన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించామన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ లక్ష్మారెడ్డి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఛాయాదేవి, వ్యవసాయ శాఖ ఏడీఏ సత్యనారాయణ, ఎంపీపీ పీ కృపేష్, ఆర్‌డీఓ వెంకటాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, యాచారం మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎంటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లిన వివాహిత కనిపించకుండా పోయిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీకుమార్ కథనం ప్రకారం.. మన్నెగూడ ఎస్ఎస్ఆర్ నగర్‌కు చెందిన బొమ్మరాజు సంతోష, వినోద్‌కుమార్ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 18న సంతోష ఎటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త పలుచోట్ల వెతికిన ఆచూకీ లభించలేదు. సంతోష తల్లిదండ్రులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు కలసి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినోద్‌కుమార్‌ను కలసిన వారిలో యూనియన్ రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య, జిల్లా అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి ఉన్నారు. - కడ్తాల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్‌ద్వారా వివరించాలని కోరారు. సెల్ నంబర్ 99592 26287లో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువులు

యాచారం: నాగార్జునసాగర్ – హైదరాబాద్ రహదారిపై కబేళాకు అక్రమంగా తరలిస్తున్న పశువులను యాచారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ లింగయ్య కథనం మేరకు.. గురువారం నల్గొండ జిల్లా కోదాడ నుంచి డీసీఎం వాహనంలో నగరంలోని కబేళాకు 54 పశువులను తరలిస్తున్నారు. మాల్ – యాచారం గ్రామాల మధ్య వాహనాల తనిఖీల్లో పశువులు తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పశువులను నగరంలోని గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



పార్థివ్ మృతదేహం

పహాడీషరీఫ్: గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఇన్‌స్పెక్టర్ భా స్కర్ వెల్లడించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ బాలాజీ టౌన్‌షిప్ ప్రాంతాని కి చెందిన పోషం గణేష్ కుమారుడు పోషం పార్థివ్(8) రెండు రోజుల క్రితం పక్కింటి పైకి ఎక్కి గాలిపటం ఎగరేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎఫ్‌టీఎల్ గుర్తింపుతో కబ్జాలకు చెక్

- పెద్ద చెరువు చుట్టూ హద్దురాళ్లు నాటాలి
- బాలాపూర్ చెరువు, కుంటల పరిరక్షణ సమితి నాయకుల డిమాండ్
- అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువును రక్షించి అభివృద్ధి చేయాలని బాలాపూర్ చెరువు, కుంటల పరిరక్షణ సమితి కోరింది. గురువారం అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాలాపూర్ పెద్ద చెరువు 65 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. గతంలో మిషన్ కాకతీయ పథకం కింద రూ. 25లక్షలు వెచ్చించి పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. దీంతో నీటి సామర్థ్యం పెరిగిందన్నారు. చెరువు సుందరీకరణ పనులకు ప్రభుత్వం రూ. 3.50 కోట్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. కానీ చెరువు ఎఫ్‌టీఎల్‌ను గుర్తింపు హద్దు రాళ్లు పాతాలని కోరారు. ఇలా చేయడం ద్వారా కబ్జాలకు చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. ఆ తర్వాతే సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. అలాగే హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయించాలని కోరారు. చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటే మత్స్యకారులు, రజకులు, ప్రజలకు జీవనోపాధి కల్పించిన వారవుతారని పేర్కొన్నారు. ఆ తర్వాతే చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. స్పందించిన అడిషినల్ కలెక్టర్ త్వరలో పెద్ద చెరువును పరిశీలన కోసం వస్తామని మాట ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో చెరువు కుంటల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, నీరుడి శ్రీరాములు, కప్పాటి ఆంజనేయులు, పగడాల ఉమేష్, బొర్ర లక్ష్మణ్, ఏ నందు, గడ్డం వెంకటేష్, ఇబ్రాం అంజయ్య, చింతపట్ల యాదగిరి, గడ్డం కుమార్, ఇబ్రాం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులు అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్
- ఆత్మగౌరవ సభను సక్సెస్ చేయాలి

కడ్తాల్: ఎస్సీ, ఎస్టీ నాయకులపై జరిగిన దాడులకు నిరసనగా ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించనున్న దళిత గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, దళిత గిరిజన సభ ఆత్మగౌరవ సభ ఇన్‌చార్జ్ భూపతిగళ్ల మహిపాల్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత గిరిజనులను అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. దళిత గిరిజనులకు ఎలాంటి కష్టమొచ్చినా కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో మార్కండేయ ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు యాట నర్సింహ, గుజ్జరి మహేశ్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, యాదయ్య, హీరాసింగ్, రాజేశ్, తులసీరాం, రవి, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత రాష్ట్రమే కేసీఆర్ లక్ష్యం





చేవెళ్ల: కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య. షాద్‌నగర్ రూరల్: ఎలికట్టలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, కాలె యాదయ్య

షాద్‌నగర్ రూరల్: అంధత్వ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట, కిషన్‌నగర్, బూర్గుల, చిన్నచిల్కమర్రి తదితర గ్రామాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వరి, తహసీల్దార్ గోపాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మన్నె కవిత, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు': ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: అంధత్వ నివారణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని అంతారం, ఆలూరు గ్రామాల్లో గురువారం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. కళ్లు బాగుంటేనే ఏ పనైనా చేసుకోవచ్చని తెలిపారు. కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంతారం సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ కావలి సుజాత, ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, నాయకులు పీ ప్రభాకర్, తోట చంద్రశేఖర్, గని, మహేశ్, వెంకటేశ్, యాదయ్య, కృష్ణ, నర్సింలు, వైద్యులు రఘుబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఖమ్మం సభకు రూ. 300కోట్లు ఖర్చా?



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

- కాసుల కోసం కమ్యూనిస్టులు కారల్ మార్క్స్ సిద్ధాంతాలను అమ్మేస్తున్నారు
- మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ధ్వజం

ఇబ్రహీంపట్నం రూరల్: ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ సభకు రూ.300 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. ఇది రాజకీయ పార్టీ ఉపాధి సభగా మారిందని ఎద్దేవా చేశారు. గురువారం ఇబ్రహీంపట్నంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఎక్కడ నిలదీస్తారేమోనన్న భయంతో బీఆర్ఎస్ డ్రామా ఆడుతున్నారని చెప్పారు. తెలంగాణలో అభివృద్ధి జరగడం లేదన్నారు. కాసుల కోసం కమ్యూనిస్టులు కేసీఆర్ పక్కన చేరి కారల్ మార్క్స్ సిద్ధాంతాలను అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. కంటి వెలుగు కార్యక్రమం 2018 ఎన్నికల ముందు పెట్టి కేసీఆర్ బొమ్మను ప్రచారం చేశారని, మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కంటి వెలుగు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు లేరన్నారు. రాష్ట్రంలో ప్రధాన కంటి ఆస్పత్రి ఒక్కటే ఉందన్నారు. ఇబ్రహీంపట్నంలో అభివృద్ధి కానరావడం లేదని, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులే అభివృద్ధి చెందారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధిష్టానం ఎక్కడ ఆదేశిస్తే అక్కడే పోటీ చేస్తానని బూర తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాయిని సత్యనారాయణ, గంగనమోని సత్యనారాయణ, గణేశ్‌గౌడ్, నోముల దయానంద్‌గౌడ్, ధనుంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చూస్తున్నందుకు పెద్దమ్మ మందలించిందని..

చెరువులో దూకి యువతి ఆత్మహత్య



శ్రావణి మృతదేహం

తుర్కయంజాల్: తరచూ సెల్‌ఫోన్ చూస్తున్నందుకు పెద్దమ్మ మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన మానేపల్లి కృష్ణ, శ్రీదేవి దంపతుల కూతురు మానేపల్లి శ్రావణి (22) ఇటీవల తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో నివాసం ఉంటున్న తన పెద్దమ్మ పద్మావతి ఇంట్లో ఉంటోంది. కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ఇనిస్టిట్యూట్‌లో చేరింది. గురువారం ఉదయం శ్రావణి సెల్‌ఫోన్ చూస్తుండగా పెద్దమ్మ మందలించింది. తీవ్ర మనస్తాపం చెందిన, శ్రావణి.. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువులో దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు.. చేపలు పట్టే వారి సహాయంతో యువతిని గుర్తించి బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెందింది.

ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

మహేశ్వరం: రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టీ యాదిష్ డిమాండ్ చేశారు. గురువారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రంలో 18లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు బోద యాదగిరి రెడ్డి, జిల్లా కార్యదర్శులు రాజు, రణధీర్ గౌడ్, విశ్వనాథ్ గౌడ్, అధికార ప్రతినిధి బస్వ రఘుగౌడ్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.